ప్రజాశక్తి
శుక్రవారం 10 నవంబరు 2023
5
శ్రీకాకుళం

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పలాస

శ్రీకాకుళం రెండో డిపో, పలాస, టెక్కలి పరిధిలోని ప్రయాణికుల కోసం ఈనెల పదో తేదీన డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్లు శర్మ, అచ్యుతరావు, ఎన్.శ్రీనివాసరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు, సూచనలను రెండో డిపో పరిధిలో 9959225609 నంబరుకు, పలాస డిపో పరిధిలో 9959225610, టెక్కలి డిపో పరిధిలో 9959225611 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

దిద్దుబాటు

- పిఎసిఎస్ అవకతవకలపై దృష్టిసారించిన అధికారులు
- సొమ్ము రికవరీకి చర్యలు
- సొసైటీ పెద్ద మనిషి నిర్వాకంతో మాయని మచ్చ
- పార్టీకి నష్టం వాటిల్లుతోందని వైసిపి నాయకుల ఆవేదన

బూర్జ పిఎసిఎస్‌లో చోటుచేసుకున్న అవకతవకలపై డిస్ట్రిక్ట్ సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు అధికారులు దృష్టిసారించారు. ప్రాథమిక సహకార సంఘంలో పక్కదారి పట్టిన సొమ్ముల రికవరీకి చర్యలు చేపట్టారు. రుణాలు రెన్యువల్ చేయని రైతులందరికీ నోటీసులు ఇచ్చి కార్యాలయానికి రప్పిస్తున్నారు. రైతులు చెప్పిన వివరాలు, రశీదులతో రుణాల లెక్కలు తేలుస్తున్నారు. సొసైటీకి కట్టిన సొమ్ముకు రశీదులు చూపిస్తే రెన్యువల్ చేస్తున్నారు. కొత్త వారికి రుణాలు అందిస్తున్నారు. మొత్తమ్మీద సొసైటీ పరపతి దెబ్బతినకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

బూర్జ పిఎసిఎస్‌లో పెద్దఎత్తున నిధులు రైతుల సొమ్ము పక్కదారి పట్టిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై ప్రజాశక్తిలో గత నెల 13 నుంచి మూడు రోజుల పాటు వరుస కథనాలతో అధికారులు రంగంలోకి దిగారు. రైతులకు నోటీసులు ఇస్తే ఎవరు చెల్లించారో, ఎవరు వాయిదాలు కట్టలేదో తెలిసే అవకాశం ఉండడంతో రైతులందరికీ నోటీసులు ఇస్తున్నారు. పిఎసిఎస్ పరిధిలోని 80 గ్రామాలు ఉండగా ఇప్పటివరకు 20 గ్రామాలకు చెందిన రైతులకు నోటీసులు ఇచ్చారు. సొమ్ములు చెల్లించినట్లు రశీదులు చూపించిన వారి రుణాలను రెన్యువల్ చేస్తున్నారు. వాయిదా సొమ్ములు చెల్లించని వారితో డబ్బులు కట్టించుకుంటున్నారు. ఇప్పటివరకు రూ.20 లక్షలను వసూలు చేశారు. కొత్తగా రూ.40 లక్షల పంటరుణాలను అందించారు.

సొసైటీకి సొమ్ము జమలో జాగ్రత్తలు

రైతులు గతంలో తాము తీసుకున్న అప్పుకు వాయిదా సొమ్ములు చెల్లించినా అవి జమ కాలేదు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని సొమ్ము చెల్లించిన వెంటనే అధికారులు రైతులకు రశీదులు అందిస్తున్నారు. సొసైటీ పెద్ద మనిషి చేతిలో పడకుండా జాగ్రత్తచర్యలు తీసుకుంటున్నారు. రైతులు చెల్లించిన సొమ్మును వెంటనే బ్యాంకుల్లో అధికారులు జమ చేస్తున్నారు.

సొసైటీ పెద్దమనిషి నిర్వాకంతో దెబ్బతిన్న పరపతి

సొసైటీ పెద్ద మనిషి నిర్వాకంతో సొసైటీ పరపతి దెబ్బతిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సొసైటీ ఖాతాలో రైతుల సొమ్ము కాకపోవడం వెనుక ఆయన హస్తం ఉన్నట్లు ఆరోపణలూ లేకపోలేదు. రుణాలకు సంబంధించి అధికారులు నోటీసులతో ఇస్తుండడంతో, పెద్ద మనిషి బాగోతం ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. కొంతమంది తాము సొసైటీ పెద్ద మనిషికే ఇచ్చామని చెప్తుండడంతో, సొసైటీలో ఇప్పటివరకు ఏం జరిగిందో రైతులకు అర్థమవుతోంది.

నోరు మెదపని టిడిపి

సొసైటీలో పెద్దఎత్తున నిధుల అవకతవకలు జరుగుతున్నా నియోజకవర్గ టిడిపి ముఖ్యనేత పట్టించుకోవడం లేదు. రైతులకు అన్యాయం జరిగినా ఈ అంశంపై కనీసం స్పందించడం లేదు. సొసైటీ పెద్ద మనిషి గతంలో టిడిపి నుంచి వైసిపిలో చేరారు. రాబోయే ఎన్నికల్లో తమకు అనుకూలంగా పనిచేస్తారన్న నమ్మకంతో ఆ నేత మౌనంగా ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అవకతవకలపై సొసైటీ పెద్దమనిషిని ఇబ్బంది పెడితే తమకోసం పనిచేయరని భావించి, ఏమీ మాట్లాడడం లేదనే చర్చ నడుస్తోంది.

ఆందోళనలో వైసిపి కేడర్

సొసైటీ పెద్ద మనిషి నిర్వాకంతో మండలంలో వైసిపికి నష్టం వాటిల్లుతుందన్న ఆందోళన ఆ పార్టీ కేడర్‌లో వ్యక్తమవుతోంది. తాము చెల్లించిన వాయిదా సొమ్ములు చెల్లించకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆగ్రహం నెలకొంది. ఇది వచ్చే ఎన్నికల్లో పార్టీకి నష్టం కలిగిస్తుందనే అభిప్రాయాన్ని నాయకులు వ్యక్తం చేస్తున్నారు. సొసైటీలో ఎంతో నమ్మకంతో పదవిని కట్టబెడితే, పార్టీ నమ్మకాన్ని దెబ్బతీశారని మండిపడుతున్నారు. అవకతవకల అంశాన్ని ఇప్పటికే శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ అంశంపై దృష్టిసారించకపోతే తీవ్రంగా నష్టపోతామని కొందరు నాయకులు వివరించినట్లు తెలిసింది. దీనిపై పార్టీ తీసుకోబోయే నిర్ణయం కోసం అంతా ఎదురుచూస్తున్నారు.

విదేశీ అతిథులు వచ్చేశాయ్

సందడి చేస్తున్న సైబీరియా వలస పక్షులు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

విదేశీ అతిథి పక్షులు టెక్కలిలోని తేలినీలాపురం విడిది కేంద్రానికి వచ్చేశాయి. రష్యాలోని సైబీరియా నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడకు చేరుకున్నాయి. ఏటా ఈ పక్షులు సెప్టెంబరులో వలస వస్తాయి. ఈ ఏడాది ఆలస్యంగా వచ్చాయి. టెక్కలి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న తేలినీలాపురం విదేశీ వలస పక్షులకు విడిదిగా పేరొందింది. రెండున్నర దశాబ్దాలుగా సైబీరియా నుంచి ఫెలికాన్, పెయింటెడ్ స్టార్క్ అనే పక్షులు వలస వస్తుంటాయి. ఇక్కడి చింత, వెదురు చెట్లపై గూళ్లు కట్టుకుని జీవిస్తాయి. సెప్టెంబరులో వలస వచ్చి సంతానోత్పత్తి చేసుకుని మార్చి, ఏప్రిల్‌లో మాతృ దేశానికి తిరుగు పయనమవుతాయి. ఇక్కడి వెచ్చని వాతావరణం గుడ్లు పొదగడానికి తోడ్పడుతుంది. గుడ్లు పెట్టేందుకు నీటి వనరులు పుష్కలంగా ఉండే ప్రాంతాలను ఇవి ఎంచుకుంటాయి. గతంలో ఐదు వేల పక్షుల వరకూ వలస వచ్చేవి. క్రమేపీ ఆ సంఖ్య వెయ్యి నుంచి రెండు వేలకు వేలకు పడిపోయింది. ఈ పక్షులు ఇక్కడి చింత, వెదురు చెట్ల మీద గూళ్లను ఏర్పాటు చేసుకుంటాయి. వీటి బరువు నాలుగు నుంచి ఏడు కేజీల వరకూ ఉంటాయి. ఇంత బరువుతో కూడా గంటకు 56 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఈ పక్షులు అగకుండా 800 కిలోమీటర్ల దూరం వరకూ ఎగరగలవు. ఆహారం కోసం దగ్గరలోని సముద్ర ప్రాంతానికి వెళ్తాయి. అక్కడ వేటాడిన చేపలను తెచ్చి పిల్లలకు అందిస్తాయి. ఆహారాన్ని గూటికి తెచ్చేందుకు ప్రత్యేకంగా వీటి ముక్కు కింద ఒక సంచిలాంటిది ఉంటుంది. ఇందులో ఒకేసారి కిలో నుంచి కిలోన్నర ఆహారాన్ని నింపుకోగలవు. తెచ్చిన ఆహారంలోంచి ఏవైనా కిందపడితే వాటిని ముట్టుకోవు. చెట్టుపై నుంచి పిల్ల పక్షులు కింద పడినా సరే వాటిని తాకవు. ఈ పక్షుల రాక కోసం గ్రామస్తులు ఎదురుచూస్తారంటే వాటితో ఎంత మమేకమయ్యారో అర్థం చేసుకోవచ్చు. గతేడాది ఎన్నడూ లేని విధంగా ఫెలికాన్ పక్షులు

మృత్యువాతపడ్డాయి. ఏటా సెప్టెంబరులో ఈ పక్షులు రావాల్సి ఉన్నా ఈ ఏడాది ఇంతవరకు రాకపోవడంతో వస్తాయా, రావా అన్న అనుమానాలు గ్రామస్తులు వ్యక్తం చేశారు. ఎట్టకేలకు అవి రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతానుభవాల దృష్ట్యా పక్షుల సంరక్షణతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సంరక్షణ చర్యలు చేపడుతున్నాం

తేలినీలాపురం విడిది కేంద్రానికి ఇప్పటివరకూ 300 ఫెలికాన్, 150 వరకు పెయింటెడ్ స్టార్క్ విదేశీ పక్షులు చేరుకున్నాయి. వారం రోజులుగా పక్షులు వస్తూనే ఉన్నాయి. పక్షుల సంరక్షణ చర్యలు చేపడుతున్నాం. వలలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తాం.

- రజనీకాంత్, అటవీశాఖ అధికారి

బలిగొన్న వరకట్న దాహం

- ఇద్దరు కూతుళ్లతో తల్లి ఆత్మహత్యాయత్నం
- మృతి చెందిన తల్లి
- మృత్యువుతో పోరాడుతున్న కుమార్తెలు
- ఆలస్యంగా వెలుగుచూసిన వైనం

భర్త కుమార్తెలతో సుజాత (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఆమదాలవలస

అదనపు కట్నం తేవాలని, పుట్టింటి నుంచి భూమి తీసుకురావాలని భర్త, మామ, మరిది వరకట్న వేధింపులతో మనస్తాపానికి గురైన మహిళ ఇద్దరు కుమార్తెలకు పురుగుల మందు పట్టించి తానూ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని అక్కులపేట చెందిన పేడాడ సుజాత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందగా, ఇద్దరు కుమార్తెలు మృత్యువుతో పోరాడుతున్నారు. మృతురాలి తల్లి సత్యవతి తెలిపిన వివరాల ప్రకారం... అక్కులపేటకు చెందిన పేడాడ శ్రీనివాసరావుకు మున్సిపాల్టీ ఒకటో వార్డు పరిధిలోని జగ్గుశాస్త్రులపేటకు చెందిన సుజాతతో 15 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి మౌనిక, మేఘన కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసరావు వ్యవసాయం చేస్తుండగా, సుజాత పొలం పనులకు వెళ్తుంది. పెళ్లయిన తర్వాత నుంచే అదనపు కట్నం, భూమి తీసుకురావాలని భర్త శ్రీనివాసరావు, మామ వెంకటరావు, మరిది శ్యామలరావు నిత్యం వేధించేవాడు. ఈ విషయాన్ని సుజాత తల్లికి చెప్పడంతో, పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. పెద్ద మనుషులు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సర్దిచెప్పినా మార్పు రాలేదు.

ఈనెల ఐదో తేదీన రాత్రి మద్యం తాగి వచ్చిన శ్రీనివాసరావు ఇదే విషయమై సుజాతతో గొడవ పడి కొట్టాడు. వేధింపులను తట్టుకోలేక మనస్థాపానికి గురైన ఆమె కుమార్తెలకు పురుగుల మందు తాగించి, ఆ తర్వాత తానూ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వారిని స్థానికులు 108 సహాయంతో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృత్యువుతో ముగ్గురు పోరాడుతుండగా, బుధవారం మధ్యాహ్నం సుజాత మృతి చెందింది. కుమార్తెల పరిస్థితి విషమంగానే ఉన్నట్లు మృతురాలి తల్లి చెప్పారు. సుజాత మృతదేహాన్ని జగ్గుశాస్త్రులపేట తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తన కుమార్తె మృతికి కారణమైన శ్రీనివాసరావు, వెంకటరావు, శ్యామలరావుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వై.కృష్ణ తెలిపారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

న్యాయ సహాయం అందించడమే లక్ష్యం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చట్టం ముందు పౌరులంతా సమానమేనని జిల్లా జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. పేదరికంతో న్యాయ సహాయం పొందలేని వారు న్యాయ సేవాధికార సంస్థ సేవలను వినియోగించుకోవాలని కోరారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ సేవలు చాలా విలువైనవని, పరిష్కారమే దొరకదనుకున్న ఎన్నో సమస్యలు పరిష్కారమైన దాఖలాలు ఉన్నాయని వివరించారు. న్యాయసేవాధికార సంస్థ న్యాయ సేవలకే పరిమితం కాకుండా ఉచిత వైద్య శిబిరాలు, కళాశాలలో అవగాహనా కార్యక్రమాలు, ర్యాలీలు, అవగాహనా సదస్సులు వంటి కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 53 మెగా లోక్ అదాలత్‌లు నిర్వహించామని, 33,498 పెండింగ్ కేసులను పరిష్కరించామని వివరించారు.

జిల్లాలో 653 లీగల్ లిటరసీ క్యాంపులు నిర్వహించడంతో పాటు 18 చోట్ల వైద్య శిబిరాలు, బ్రదర్ హుడ్, గుడ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో అవగాహనా కల్పించామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు కె.శ్రీదేవి, పి.భాస్కరరావు, ఎస్.మహేంద్ర ఫణికుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, మేజిస్ట్రేట్ శ్రీవిద్య, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎఎస్‌పి తిప్పేస్వామి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు, లోక్ అదాలత్ చైర్మన్ జ్ఞాన సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే జగనే ఉండాలి

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి కొనసాగాల్సిన అవసరం ఉందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరులో గురువారం నిర్వహించిన 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో పయనిస్తూ, సంక్షేమ పాలనతో అన్ని వర్గాల ఆదరాభిమానాలను చూరగొందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం నాలుగు మూల స్తంభాలుగా పరిపాలన కొత్త పుంతలు తొక్కిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో సాగుతోందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని పనులను వైసిపి ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ అమలు చేయడంతో పాటు, ప్రజలకు వాగ్దానాలు ఇవ్వని పనులనూ చేపట్టిందని వివరించారు. సంక్షేమ రాజ్య స్థాపన జగన్‌తోనే సాధ్యపడిందని, దేశంలో మరే రాష్ట్రంలోనూ అమలు కాని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని తెలిపారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఎన్నికలు దగ్గరకు వస్తున్న తరుణంలో జగనన్నే మళ్ళీ ముఖ్యమంత్రి ఎందుకు కావాలన్న అంశంపై వైసిపి నాయకులు, కార్యకర్తలు ఈ నాలుగున్నరేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని చెప్పేందుకు ప్రజల దగ్గరకు వెళ్ళడానికి చేస్తున్న కార్యక్రమం ఇదని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల, పట్టణ అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, జి.నాగరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బాడాన సునీల్, వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బండారు జై ప్రతాప్ కుమార్, వైస్ సర్పంచ్ అనకాపల్లి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బోర్డును పరిశీలిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

మాట్లాడుతున్న జ్ఞాన సువర్ణరాజు

సత్వర న్యాయానికి శాశ్వత లోక్ అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు లోక్ అదాలత్‌ను సంప్రదించాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని చెప్పారు. పౌరులకు వైద్యారోగ్యశాఖ అందించే సేవల్లో ఏమైనా లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. లోక్ అదాలత్ నిర్వహణ, కేసుల పరిష్కారంపై సోదాహరణలతో వివరించి అనుమానాలను నివృత్తి చేశారు. లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సదస్సులో జిల్లా వైద్యారోగ్యశాఖ బి.మీనాక్షి, ఎడిఎంహెచ్ఒ ఎన్.అనురాధ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఈశ్వరీదేవి, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉంటూ గంజాయి, గుట్కా, నాటుసారా, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అడ్డుకట్ట వేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాసంస్థల పరిధిలో గంజాయి, గుట్కా, పొగాకు విక్రయాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఇసుక రవాణా సమయంలో ఎటువంటి బిల్లులు లేకుంటే కేసులు నమోదు చేయాలని సూచించారు. నాటుసారా తయారీ, ఉత్పత్తి, విక్రయ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. నాటుసారా తయారీ మార్గాలపై ముందుస్తు సమాచారాన్ని సేకరించి దాడులు చేపట్టి ముడి పదార్థాలను నిర్వీర్యం చేయాలని సూచించారు. ఇటీవల గంజాయి, ఇసుక, నాటుసారా, మద్యం, పలు కేసుల ప్రాపర్టీని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిఐ రోజులనాయుడు, ఎస్ఐలు శ్రీనివాసరావు, అనిల్ కుమార్, కానిస్టేబుల్స్ రామారావు, జగదీష్ పోలీస్ సిబ్బందికి ఎస్‌పి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. సమావేశంలో ఎస్ఇబి జాయింట్ డైరెక్టర్ వి.నాగమణికంఠ, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, ఎస్ఇబి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తుతో ఛార్జిషీట్ దాఖలు

సమగ్రమైన దర్యాప్తుతో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా కేసులు దర్యాప్తు చేయాలని ఎస్‌పి రాధిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలపై జరిగిన నేరాల్లో ఫిర్యాదు అందిన వెంటనే సకాలంలో స్పందించి నేర స్థలానికి చేరుకుని సాక్ష్యాధారాలను సేకరించాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి, పోక్సో వంటి ముఖ్యమైన కేసుల్లో ప్రతి అంశాన్నీ పరిశీలించి, నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. విచారణలో, పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పిలు టి.పి.విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు వై.శృతి, జి.బాలచంద్రా రెడ్డి, డి.నాగేశ్వరరావు, కె.బాలరాజు, విజయకుమార్, ఎస్.వాసుదేవ్, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్‌పి రాధిక

మెనూ అమలు తప్పనిసరి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు

పాతపట్నం : ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయాలని రాష్ట ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన వంటకాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా నాడు-నేడు పనులతో అభివృద్ధి చేసి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఈ సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, పిఎంఎంవివై జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.సన్యాసిరావు, ఐసిడిఎస్ సిడిపిఒ విమలరాణి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కాంతారావు

పథకాలు అమలవ్వాలంటే జగన్ మళ్లీ రావాలి

కవిటి : మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- కవిటి

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అవినీతి రహితంగా సంక్షేమ పథకాల అమలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆర్థిక సాయం, రాష్ట్రంలోని ప్రతి మహిళకు ప్రత్యేక గుర్తింపు ప్రస్తుత ప్రభుత్వంలోనే సాధ్యమైందని, అందుకే మళ్లీ జగనే అధికారంలోకి రావాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కవిటి సచివాలయం-1లో జగనే ఎందుకు రావాలి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఓటరుకు వైసిపి ప్రభుత్వం విధి విధానాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, పూర్తిస్థాయిలో అమలు జరిపిన మేనిఫెస్టో వివరాలు తెలియజేయాలని సూచించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాలు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, కవిటి, ఇచ్ఛాపురం పిఎసిఎస్ అధ్యక్షులు దేవరాజు సాహు, ఎఎంసి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, నర్తు నరేంద్ర, ఎఎంసి వైస్ చైర్మన్ వై. నీలయ్య, ఎంపిటిసి పూడి నీలాచలం, మండల కో-ఆప్షన్ సభ్యుడు పాండవ శేఖర్, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, ఇఒ వీరభద్ర స్వామి, పలువురు సర్పంచ్‌లు, వైసిపి నాయకులు, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మెళియాపుట్టి గ్రామ సచివాలయంలో స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో ఎపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్,మ జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, మండల పార్టీ కన్వీనర్ పల్లి యోగి, జయమునిరావు, మాధవరావు, శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

నందిగాం: వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలనికోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన వైఎపినీడ్స్ జగన్ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు ఎంపిటిసిలతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు తమరి ఫల్గుణరావు, జెసిఎస్ మండల కన్వీనర్ జడ్యాడ జయరాం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రతినిధి మండల వైసిపి అధ్యక్షులు పుక్కల గురయ్య నాయుడు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, మండల సచివాలయ కన్వీనర్ వడ్డీ కరుణాకర్, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి అలివేలు మంగమ్మ, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, ఇఒపిఆర్‌డి తిరుమలరావు, ఎంపిటిసి బమ్మిడి మోహనరావు, వైస్ ఎంపిపి శాంతరావు, వైస్ సర్పంచ్ జోగారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలో వై నీడ్ జగన్ కార్యక్రమం లాలపేట. ఫకీరు పేట సచివాలయం పరిధిలో నిర్వహించారు. ఈ కార్యమానికి వైసిపి ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, సీడ్ ఎపి చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్ భారతీ దివ్య, వార్డ్ కౌన్సిలర్‌లు టెంక లక్ష్మీ, తాడి ఆదిరెడ్డి, ప్రత్తి అన్వేష్, తులసీదాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్, ఢిల్లీ పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక సచివాలయం-1 వద్ద ఎపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, ఎంపిటిసిలు జి.రత్నకుమారి, లక్ష్మీనారాయణ, సర్పంచ్ పి.కృష్ణవేణి, వైసిపి నాయకులు వైకుంటారావు, బి.శ్రీను పాల్గొన్నారు.

బూర్జ: మండల కేంద్రమైన బూర్జలో ఆంధ్రప్రదేశ్‌కి మళ్లీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ కండాపు గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి కణ నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి బుడమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, గుమ్మడి రాంబాబు, బూర్జ సర్పంచ్ ఏగు అనురాధ, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ రమణారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

టెక్కలి రూరల్ : టెక్కలి సచివాలయం-1లో వై నాట్ జగన్‌ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, చింతాడ గణపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు బగాధి హరి, ఎంపిటిసిలు కూన పార్వతి, పీత హేమలత, వాకాడ శ్రీధర్ రెడ్డి, యర్ర అనంతయ్య, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి సచివాలయం-1లో రాష్ట్రానికి జగనన్న ఎందుకు కావాలంటే ("వై ఏపీ నీడ్స్ జగన్") కార్యక్రమం సర్పంచ్ కాళ్ల సంజీవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జేఎస్‌సీ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం, తదితర అంశాలను గృహసారదులకు, వాలంటీర్లుకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, వైసిపి నాయకులు బోయిన కృష్ణారావు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సూర్యనారాయణ (ఫైల్)

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం చీపుర్లపాడు పంచాయతీ దుర్గంపేట గ్రామ సమీపంలో కోటబొమ్మాళి నుంచి సంతబొమ్మాళి వెళ్లే రహదారిలో గురువారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చీపుర్లపాడు గ్రామానికి చెందిన లింగుడు సూర్యనారాయణ (37) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు సూర్యనారాయణ సంతబొమ్మాళి మండలం వడ్డివాడలో ఇటీవల మృతుడు అమ్మమ్మ మృతి చెందింది. అమె దినకార్యం కోసం చీపుర్లపాడు నుంచి కూరగాయలు కొనుగోలు చేసి తన సొంత ఆటోలో తన భార్య త్రివేణి, కుమార్తె నిత్యశ్రీలతో కలిసి వడ్డివాడ వెళ్తుండగా దుర్గంపేట గ్రామ సమీపంలో రోడ్డుకు ఉన్న గుంతలు తప్పించబోయి ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో ఈ సంఘటన జరిగింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన సూర్యనారాయణకు స్థానిక సామాజిక అస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. కాగా ఆటోలో మృతుడుతో ప్రయాణిస్తున్న భార్య, కుమార్తెకు ఎలాంటి గాయాలు కాలేదు. మృతుడు భార్య త్రివేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ షేక్ మహ్మద్అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదుపు తప్పి గెడ్డలోకి దూసుకెళ్లిన టిప్పర్

గెడ్డలో పడిన పోర్టు వాహనం

ప్రజాశక్తి- నౌపడ

మండలం సున్నాపల్లి గ్రామ సమీపంలో ఉప్పునీటి గెడ్డలో గురువారం వేకువజామున పోర్టుకు రాళ్ల తరలిస్తున్న టిప్పర్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. గురువారం రాత్రి పోర్టులో రాళ్లుదించి తిరిగి వస్తున్న వాహనం డ్రైవర్ నిద్రమత్తు కారణంగా వంతెన పైనుంచి గడ్డలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. ఎవరికి ఏమీ జరగకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

గూడెం సమీపంలో పెద్దపులి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

జిల్లాలో గత కొన్ని రోజులుగా పెద్దపులి సంచరిస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న విషయం తెలిసిందే. గురువారం మధ్యాహ్నం టెక్కలి మండలం గూడెం గ్రామ సమీపంలో పెద్దపులి పాద ముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. అనంతరం పెద్దపులి డమరు గ్రామం చేరుకుని అక్కడి నుంచి సమీపంలో ఉన్న అడవిలోకి వెళ్లినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

నాణ్యమైన విద్యను అందించాలి

విశ్వశాంతి విద్యార్థులు చేసిన పరికరాలతో రాష్ట్ర పరిశీలకులు

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వం అందిస్తున్న అటల్ ల్యాబ్ విధానం ద్వారా విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించాలని రాష్ట్ర పరిశీలకులు కెవి రమణ ఆదేశించారు. గురువారం ఈదులవలస ఎపి మోడల్ స్కూల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌లు, వారు అనుసరించిన విధానం, పరికరాలు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. అలాగే విద్యాబోధన, ల్యాబ్ ద్వారా తెలుసుకున్న విషయాలను విద్యార్థులకు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మండల కేంద్రంలో విశ్వశాంతి హైస్కూల్‌ను పరిశీలించారు. విశ్వశాంతి విద్యార్థులు చేసిన పరికరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారితో హైస్కూల్ డైరెక్టర్ మెట్ట జనార్ధనరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఎస్‌ఒ కుమారస్వామి, ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ ఎం.నీలం, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఎఇపై ఎంపిపి ఆగ్రహం

మాట్లాడుతున్న ఎంపిపి పిన్నింటి రజని

రణస్థలం: రణస్థలం విద్యుత్‌శాఖ ఎఇ శ్రీనివాసరావుపై రణస్థలం వైస్ ఎంపిపి రాయపురెడ్డి భుజంగరావు(బుజ్జి) ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పిన్నింటి రజనీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఇ మాట్లాడిన తరువాత వైస్ ఎంపిపి మాట్లాడుతూ మండలంలో సీతంవలస గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు వ్యవసాయ పంపుసెట్లు కోసం దరఖాస్తు చేసుకుంటే రూ. 4.80 లక్షలు అంచనా వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కార్యాలయానికి వెళ్లి ఎఇని కలిసి ఈ ఇద్దరు రైతులు చాలా పేదవారని ఎస్టిమేషన్ తగ్గించి వేయాలని చెప్పినా వినలేదని, రైతులు పేదవారైతే ఇళ్లు అమ్మి డబ్బులు కట్టమని అన్నారని, రైతులను అవమానపరుస్తూ మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక చర్చిఫాదర్ ఎఇని కలిసి ఎస్టిమేషన్ చాలా ఎక్కువగా వేశారని అడగడంతో రూ.3.80 లక్షలకు వేసి రూ.లక్ష తగ్గించారని, ప్రజాప్రతినిధిని చెబితే తగ్గించని ఎస్టిమేషన్ ఒక చర్చి ఫాదర్ చెబితే ఎలా తగ్గిందని ప్రశ్నించారు. మా రైతులు వద్ద నాపరువు తీసారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో హాజరైన అధికారులు ఆయా శాఖలపై సమీక్షించారు. ఎంపిపి పిన్నింటి రజనీ మాట్లాడుతూ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్న మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలపాలని అధికారులను కోరారు. సమావేశంలో హాజరైన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు వారి గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ బి.దుర్గారావు, ఎంపిడిఒ రమణమూర్తి, తహశీల్దార్ కిరణ్ కుమార్, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, మండల ఎఒ ధనుంజయరావు, వైస్ ఎంపిపి కామరాజు, వెంకట్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గొట్టిపల్లిలో ఇంటింటికీ కుళాయి

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలం గొట్టిపల్లి పంచాయతీలో సర్పంచ్ అవ్వ రాజేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ కుళాయి వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గురువారం గొట్టిపల్లి, రెడ్డిపేట గ్రామంలో రహదారికి ఇరువైపుల ప్రొక్లైనర్‌తో పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యుఎస్ పథకం ద్వారా ఎంఎల్‌ఎ ధర్మాన కృష్ణదాస్ సహకారంతో రూ. కోటి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిదులతో రెడ్డిపేటలో మంచి నీటి పథకం, గొట్టిపల్లిలో ఒక మంచి నీటి పథకం నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి వేయడం జరుగుతుందని తెలిపారు. సుమారు 1500 కుటుంబాలకు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

రెడ్డిపేటలో చేపడుతున్న పనులు

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఇఇ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి ఇండోర్ సబ్-స్టేషన్ పరిధిలో ఇండస్ట్రియల్ ఏరియాలో రోడ్ క్రాసింగ్ కొరకు స్తంభాలు వేయడం జరిగిందని వైర్లను మార్చుటకు, చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ ఎంపిడిఒ కార్యాలయం రోడ్డు, గేటు ఏరియా, కృషివిజ్ఞాన కేంద్రం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చీకటిని పారదోలి వెలుగునిచ్చే దీపావళి పండగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో యాజమాన్యం తరపున సిబ్బందికి దీపావళి కానుకలను ఆయన గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగను కుటుంబ సభ్యుల మధ్య ఆనందోత్సవాలతో జరుపుకోవాలని కోరారు. చెడుపై మంచి ఎప్పుడూ విజయం సాధిస్తూనే ఉంటుందని, అందుకు సంకేతంగా దీపావళి నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మెడికవర్ హెచ్‌ఆర్ దిలీప్, రవి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి కానుకలు అందజేస్తున్న దానేటి శ్రీధర్

గొడౌన్ పరిశీలిస్తున్న కాంతారావు

ఎఫ్‌సిఐ గోదాము పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టిలోని ఆల్ ఆంధ్ర రోడ్డులో ఉన్న ఎఫ్‌సిఐ గొడౌన్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి. కాంతారావు గురువారం పరిశీలించారు. స్టాక్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. ఈయనతో పాటు తహశీల్దార్ పి.సరోజిని, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

పొందూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని గ్రామాల్లో వాటిని అరికట్టాల్సిన బాధ్యత గ్రామ పెద్దలదేనని సివిల్ కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి జస్టిస్ బి.జ్యోత్స్న పేర్కొన్నారు. జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆధ్వర్యంలో మండలంలోని రాపాక గ్రామంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలతో వెట్టి చాకిరి పనులను చేయించరాదని, అటువంటి పనులు నేరమని, బడి ఈడు పిల్లలను బడికే పంపించాలని తెలిపారు. లోక్‌అదాలత్‌లో పరిష్కరించదగ్గ కేసుల విషయంలో రాజీ చేసుకోవాలని, ఇరువర్గాలను ఒప్పించే బాధ్యతను పోలీసులతో పాటు గ్రామపెద్దలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో చట్టాలపై అవగాహన కల్పించడానికే న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బ్రహ్మజీ, ఎస్.రాము, రామ్మోహనరావు, సురేష్ కుమార్, గ్రామస్తులు కొంచాడ రఘుబాబు, బలగ శంకరభాస్కర్ పాల్గొన్నారు.

కొత్తూరు: జాతీయ న్యాయ.సేవా దినోత్సవం సందర్భంగా స్థానిక విజ్ఞాన భారతి ప్రైవేటు ఉన్నత పాఠశాలలో జూనియర్ సివిల్ కోర్టు సూపరింటెండెంట్ టి.నూకరాజు అధ్యక్షతన గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మహ్మద్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోరాదని, బాల్య వివాహాలను ప్రోత్సాహిస్తే నేరమన్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది శ్రీనివాసరావు, కె.సాయిరాం, న్యాయవాదులు ధర్మారావు, రాద రాజు, రవికిరణ్, ప్రసాద్, ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు పాల్గొన్నారు.

టెక్కలి: సమాజంలో ప్రతీ ఒక్కరు ఏదో ఒక వృత్తిలో జీవిస్తుంటున్నారని ఆటువంటి వారు తమ హక్కులను పొందుతునే తమ భాధ్యతల్ని కాపాడుకోవాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్లా అన్నారు. స్థానిక బ్రిలియంట్ స్కూల్‌లో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధమిక హక్కులు ఎంత ముఖ్యమో విధులు కూడా అంతే ముఖ్యమన్నారు. విద్యార్ధులు చదువుకోసం బడిలో ఉండాలేగానీ పనిలో కాదన్నారు. ఈ సదస్సులో టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, పి.మధుబాబు, పొట్నూరు ఆనందరావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.నాగభూషణం, ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక స్వర్ణ భారతి విద్యా సంస్థలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ చాటల తులసీ దాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన మేజిస్ట్రేట్ పరాస్ కుమార్ విద్యార్ధులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవంలో భాగంగా న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని చైర్మన్ తులసీదాస్ రెడ్డి తెలిపారు. విద్యా సంస్థల కో-ఆర్డినేటర్ సిహెచ్ నీలిమరెడ్డి, న్యాయవాదులు సీతయ్య, నాగరాజు పాత్రో, రంగారావు, మురళి, సంస్థల ప్రతినిధులు జై ప్రకాష్, సందీప్ పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యంతో పౌరసరఫరాల శాఖ డిటి అమర్నాథ్

పిడిఎస్ బియ్యంతో ఆటో పట్టివేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీ పరిధిలో 2వ వార్డు కృష్ణాపురం జంక్షన్ వద్ద ప్రభుత్వం సరఫరా చేస్తున్న పిడిఎస్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్న ఆటోను పట్టుకున్నట్లు పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ దువ్వాడ అమర్నాథ్ తెలిపారు. నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన ఎన్ని సాయిరాం, ఆమదాలవలసకు చెందిన పొట్నూరు మనోజ్ కుమార్‌లు ఆమదాలవలస నుంచి నరసన్నపేటకు పిడిఎస్ బియ్యం తరలిస్తున్నారు. విజిలెన్స్ హెచ్‌సి కె.అప్పన్న. పౌరసరఫరాల సిబ్బంది కృష్ణాపురం జంక్షన్ వద్ద మాటువేసి ఆటో ఆపి తనిఖీ చేయగా 17 ప్యాకెట్లు 850 కేజీల బియ్యంను పట్టుకుని ఆటోను, బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కరువు ప్రాంతాల్లో టిడిపి నాయకుల పర్యటన

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని ముఖలింగాపురం పంచాయితీ పరిధిలో ముఖలింగాపురం, చిరుతనాపల్లి, బెండకాయల పేట, డమర తదితర గ్రామాల్లో గురువారం టిడిపి నాయకులు పర్యటించారు. వర్షాధారం మీదనే ఆధారపడి ఉన్న పంట పొలాలకు సాగునీరు లేక రైతులు ఎదుర్కోంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. నర్సింగపల్లి, ముఖలింగాపురం పంచాయితీల్లో పలు గ్రామాల్లో వ్యవసాయం చేసుకోవాలంటే సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రైతుల అభిప్రాయాలను విన్న నాయకులు సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఈ పర్యటనలో మండల టిడిపి అధ్యక్షులు బగాది శేషగిరిరావు, హనుమంతు రామకృష్ణ, మట్ట పురుషోత్తం, పోలాకి షణ్ముఖరావు, ఇప్పిలి జగదీష్ పాల్గొన్నారు.

ఎండిన పొలాలను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

పలాస ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధులతో బాధపడుతూ మరణిస్తున్నారని, కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఉద్దాన ఆరోగ్య పరిరక్షణ నాయకులు బి.ఓంకార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్లు కావస్తున్నా కిడ్నీ ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి ఎందుకు ప్రారంభం చేయలేకపోయారని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో అనేక మంది యువతీ, యువకులు కిడ్నీ వ్యాధికి బలై పిట్టల్లా రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిడ్నీ జబ్బులతో యువకులు చనిపోవడంతో చిన్నపిల్లలు అనాధులవుతున్నారని, అటువంటి పిల్లలను గుర్తించి పిజి వరకు నాణ్యమైన పాఠశాలల్లో పూర్తి ఉచిత విద్యను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వృద్ధాప్యంలో వున్న తల్లి తండ్రులకు, భార్యకు కనీసం రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలని కోరారు. కిడ్నీ జబ్బుకు మూలాలు కనుగొంటామని చెప్పి నాలుగేళ్లు దాటిన ఇంతవరకు కిడ్నీ పరిశోధన కేంద్రం ప్రారంభించలేదన్నారు. పలాస కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే భవిష్యత్‌లో ప్రజాసంఘాలతో కలిపి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు సిఐటియు నాయకులు ఎన్.గణపతి, సిపిఐ నియోజకవర్గ నాయకులు చాపర వేణుగోపాల్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దిల వినోద్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారి మీనాక్షి

హెచ్‌ఐవి సోకకుండా చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో హెచ్‌ఐవి సోకిన తల్లుల నుంచి బిడ్డలకు ఆ వ్యాధి సోకకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఉందని డిఎంహెచ్‌ఒ డాక్టరు బి.మీనాక్షి అన్నారు. గురువారం డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో సాతీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన సంబంధిత శాఖల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవి రోగులకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలను ఆమె వివరించారు. ప్రధానంగా గర్భిణీ స్త్రీలకు హెచ్‌ఐవి సోకినట్టు నిర్ధారణ అయితే బిడ్డకు ఆ వ్యాధి సోకకుండా సకాలంలో వైద్యసేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.అనురాధ, సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు.

మొక్కల బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదే

కోటబొమ్మాళి: ఉపాధిహామీ పథకం ద్వారా రోడ్లుకు ఇరువైపుల, చెరువుగట్లుపై, రైతుల పొలాల్లో నాటే ప్రతిమొక్కను నూరుశాతం బ్రతికించుకోవాల్సిన బాధ్యత ఫీల్డుఅసిస్టెంట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి.చిట్టిరాజు అన్నారు. గురువారం మండలం కన్నేవలస గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా పంపిణీ చేసి నాటిన మునగ, మామిడి మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన రైతులతో మాట్లాడుతూ నాటన ప్రతిమొక్క బతికించే బాధ్యత మీదేనని, అందుకు మూడు సంవత్సరాలు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతుందన్నారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి కుటుంబానికి 100 రోజులు పనులు కల్పించే విధంగా పనులు గుర్తించి నివేదికలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో జిఇ జి.హరిప్రసాద్, టి.రాంబాబు పాల్గొన్నారు.

కన్నేవలసలో మునగ తోటను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

పంటకోతతో దిగుబడుల అంచనా

ప్రజాశక్తి- బూర్జ

పంటకోత ప్రయోగాల ద్వారా దిగుబడిలను ఆర్‌బికె సిబ్బంది గురువారం అంచనాలు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలో నీలాదేవిపురం సచివాలయం పరిధిలో ఉవ్వపేట రైతు బట్న జనార్ధనరావు పొలంలో, మామిడివలస సచివాలయం పరిధిలో పెద్దలంకం రైతు మీసాల సత్తిబాబు పొలంలో ఆర్‌బికె సిబ్బంది వరి పంటకోత ప్రయోగం నిర్వహించారు. బట్న జనార్ధనరావు వరి పంట దిగుబడి ఎకరానికి 22.02 డిటిఎల్ఎస్, మీసాల సత్తిబాబు వరి పంట ఎకరానికి దిగుబడి 17.77 డిటిఎల్ఎస్ వచ్చాయని మండల వ్యవసాయ శాఖ అధికారి వి.రాజేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఓరియంటల్ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి మురళి, వి ఎఎఎస్ సిహెచ్ గౌతమి, వసంత, రైతులు కాగితాపల్లి జగన్, చింతం విశ్వనాధం పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

చదువుతో పాటు క్రీడలు అవసరం

పలాస : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టిసారించాలని, భవిష్యత్ ఎదుగుదలకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. గురువారం పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో మండలస్థాయి గ్రిగ్ ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడలకు హాజరైన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు డి.దశరథ, సిహెచ్ సత్యం, మల్లా భద్రయ్య, బద్రి గోపాల్, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు, సమన్వయకర్త పి.తవిటయ్య, మండల క్రీడల సమన్వయకర్త సిహెచ్ పద్మలోచన, వ్యాయామ ఉపాధ్యాయులు బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. క్రీడలకు న్యాయ నిర్ణేతలుగా ఎన్.రామారావు, ఎన్.చంద్రశేఖర్, పి.గజేంద్రరావు, ఎస్. విజయ్, జి.జె.జె.రావు, సంతోషిలు హాజరయ్యారు.

క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

వైసిపి పాలనకు చరమగీతం

ఎమ్మెల్యే బెందాళం అశోక్

ప్రజాశక్తి- కవిటి

రాబోయే ఎన్నికల్లో వైసిపికి చరమగీతం పాడి రాష్ట్రాన్ని అక్రమార్కుల చేతుల నుంచి కాపాడాలని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. మండలం జగతి గ్రామంలో గురువారం భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు, దౌర్జన్యాలు ప్రజలకు వివరించారు. ముఖ్యంగా రైతాంగ వ్యవస్థ నిర్వీర్యమైందని, రైతు పేరు పెట్టుకుని రైతుల నడ్డి విరిచారని విమర్శించారు.

రైతు భరోసా రూ.13,500లు ఇస్తామని, రూ.7,500లు మాత్రమే ఇస్తున్నారని, కేంద్రం నుంచి వస్తున్న ప్రతి పథకం రాష్ట్ర ప్రభుత్వానిదే అంటూ గొప్పలకు పోతున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాలు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొందల కృష్ణారావు, బెందాలం రమేష్, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, బార్ల చినబాబు పాల్గొన్నారు.